

కన్నుపడితే కబ్జానే..!

అతనో భూబకాసురుడు. స్థలం కనిపిస్తే చాలు అధికారుల అండతో అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుంటాడు. కన్నతల్లి భూమినీ ఆమెకు తెలియకుండా కాజేశాడు.

- 8లో..



గంజాయి ముఠా అరెస్టు

జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న 12 మంది ముఠాను అరెస్టు చేసినట్లు ఒంగోలు డీఎస్పీ తెలిపారు. 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
31/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

పింఛన్ల కోతకు కుట్ర

- పెన్షన్ లబ్ధిదారులను ఇంటింటా తనిఖీ
- 15 ప్రశ్నలతో విచారణ చేస్తున్న అధికారులు
- ఏదో ఒక వంకతో పింఛన్లు తొలగించేందుకు కసరత్తు

సంతనూతలపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో పింఛన్ల మంజూరు కోసం కొత్తగా ఎవరైనా అర్హులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే ఆన్‌లైన్ సేవలు సైతం పూర్తిగా నిలిచిపోయాయి. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఇప్పటికే ఉన్న పింఛన్లపై వెరిఫికేషన్ పేరుతో కోతపెట్టేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద సంతనూతలపాడు మండలం చిలకపాడు గ్రామంలో సోమవారం జిల్లాలోని పలు మండలాలకు సంబంధించి గెజిటెడ్ అధికారులు బృందం, సచివాలయ సిబ్బంది, ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారుల ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టారు. డీఆర్డీఏ ఏపీడీ జిల్లా ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ జీ.వి వరప్రసాద్ పర్యవేక్షణలో అధికార బృందం, వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామంలో ఉన్న 397 పెన్షన్లకుగాను 380 పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి వారి ఆర్థిక స్థితిగతుల వివరాలు సేకరించారు. పెన్షన్‌దారుల గురించి 15 ప్రశ్నలకు సంబంధించి యాప్‌లో వారి వివరాలు నమోదు చేశారు. ఒక్కొక్క టీంలో ఒక ఎంపీడీవో, ఈవోఆర్డీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు 40 మంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులను ఇంటింటా తనిఖీ చేశారు. మరొక 17 మంది లబ్ధిదారులు గ్రామంలో లేకపోవడంతో మంగళవారం ఆయా పెన్షన్లను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో, పెన్షన్ సంబంధించిన అర్హతలు, వారి ధ్రువపత్రాలు, సామాజిక పరిస్థితి వివరాలన్నీ ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేశామని ఎంపీడీఓ సురేష్ బాబు తెలిపారు. ఈ విచారణతో చిలకపాడు గ్రామ సచివాలయ పరిధిలోని పింఛన్ లబ్ధిదారులు బెంబేలెత్తిపోయారు. పక్షపాతంతో గానీ, పార్టీ పరంగా గానీ తమకు ఇస్తున్న పెన్షన్లను తీసివేయొద్దని వారు మొరపెట్టుకున్నారు. సంతనూతలపాడు ఎంపీడీవో డీ సురేష్ బాబు పర్యవేక్షణలో చిలకపాడు పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రావు, వీఆర్వో హనుమంతరావు, చిలకపాడు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.ప్రతాప్ కుమార్ అధికారుల బృందానికి పెన్షన్ దారుల సమాచారాన్ని తెలియజేశారు.



అక్రమంగా 6ఏ కేసు నమోదు

ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గుడిపాటి జేమ్స్. కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామంలో 20వ నంబరు రేషన్ దుకాణంలో 20 సంవత్సరాలుగా రేషన్ డీలర్‌గా ఉంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కూటమి నేతల బెదిరింపులకు లొంగలేదు. ఇతనిపైకి అధికారులను పంపారు. నవంబరు 22వ తేదీ సంబంధిత అధికారులు అక్రమంగా 6ఏ కేసు నమోదు చేశారు. నిలువ ఉండాల్సిన బియ్యం ఉన్నప్పటికీ తక్కువ స్టాక్ ఉందని కారణాన్ని చూపుతూ రాజకీయ ఒత్తిడి మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమ కేసు బనాయించి రేషన్ డీలర్‌షిప్‌ను రద్దు చేశారు.



అధికారంలోకి రావడమే ఆలస్యం కూటమి నేతల కన్ను రేషన్ దుకాణాలపై పడింది. పథకం ప్రకారం రేషన్ డీలర్లపై కక్షసాధింపులకు దిగారు. రాజీనామాలు చేసి తొలగిపోవాలంటూ ఒత్తిళ్లు తెచ్చారు. లేదంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. అప్పటికీ లొంగనివారిపై అధికారులను ఉసిగొల్పారు. అధికార పార్టీ నేతలు చెప్పారో లేదో క్షణాల మీద సంబంధిత రేషన్ దుకాణాలపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించారు. 90 శాతం దుకాణాలను సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత రేషన్ దందాకు తెరతీశారు. టన్నులకొద్దీ బియ్యాన్ని పొరుగు రాష్ట్రాలకు తరలించేస్తున్నారు.

పచ్చ దుకాణం

- రేషన్ షాపులను కొల్లగొట్టేందుకు కూటమి కుట్రలు
- జిల్లాలో 90 శాతానికిపైగా డీలర్లను బలవంతంగా మార్చిన పచ్చనేతలు
- రాజీనామా చేయని డీలర్లకు సరుకులు ఇవ్వకపోగా కేసులతో బెదిరింపులు
- అధికార పార్టీ నేతలకు జీ హుజూర్ అంటున్న అధికారులు
- డీలర్లు మారిన తర్వాత రేషన్ బియ్యం పక్కదారి
- జూలై నెల నుంచి ఇప్పటి వరకు 84 దాడులు
- 100కు పైగా 6ఏ కేసులు నమోదు

ఒంగోలు అర్బన్:

కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రేషన్‌షాపులను టార్గెట్ చేశారు. వందల కోట్ల విలువైన పేదల బియ్యాన్ని బొక్కేందుకు పథకం రచించారు. అనుకున్నదే తడవుగా పాత రేషన్ డీలర్లను తొలగించి వారి స్థానంలో పచ్చ పార్టీ సానుభూతిపరులకు అప్పగించేందుకు దౌర్జన్యాలు, బెదిరింపులకు దిగారు. మూడు దశాబ్దాలుగా పర్మినెంట్ రేషన్ షాపులు నిర్వహిస్తున్న వారిని సైతం వెంటాడారు. ఎస్సీ, ఎస్టీ, ఒంటరి మహిళలను వదల్లేదు. వారి రేషన్ షాపులను సైతం కబళించారు. "సీజ్ ద షాప్..ఛేంజ్ ద డీలర్.." అంటూ సివిల్ సప్లయిస్ అధికారులు, రెవెన్యూ అధికారులను ఉసిగొల్పారు. అధికార పార్టీ నేతలకు అధికారులు జీ హుజూర్ అంటూ అక్రమ కేసులు బనాయించడంలో తమవంతు పాత్ర పోషించారు. రేషన్ షాపులపై, రేషన్ పంపిణీ సమయంలో సివిల్ సప్లయిస్ డీటీలు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కాపుకాసి కేజీ, అర కేజీ రేషన్ సరుకులు తేడా వచ్చినా 6ఏ కేసులు బనాయిస్తూ పాత డీలర్లను గడగడలాడించి వారితో రాజీనామాలు చేయించడంలో సఫలీకృతులయ్యారు. రాజీనామా చేయని డీలర్ల సరుకులు ఇవ్వకుండా ఉండటంతో కేసులు నమోదు చేస్తామని బెదిరించడం వంటి చర్యలకు దిగారు.

90 శాతానికిపైగా షాపులు పచ్చనేతల వశం.

జిల్లాలో దాదాపు 1392 రేషన్ షాపులు ఉండగా వాటిలో దాదాపుగా ఇప్పటికే 90 శాతం పైగా షాపులను కూటమి మనుషులకు కట్టబెట్టారు. కొన్ని షాపులు పాత డీలర్లతో రాజీనామాలు చేయించి కొత్త వారికి ఇస్తే.. మరికొన్ని షాపులు పాత డీలర్ల పేరుతోనే ఉంచి టీడీపీ నేతలు షాపులు నిర్వహించేలా అధికారులు, కూటమి నేతలు కలిసి సెటిల్ చేశారు. దీంతో ఇప్పటి వరకు రేషన్ షాపులు నిర్వహించే వాళ్లు రోడ్డున పడ్డారు. అంతేకాకుండా ఎన్ని ప్రభుత్వాలు మారినా పర్మినెంట్ డీలర్‌లుగా కొనసాగుతున్న వారి జోలికి ఇంతవరకు ఎప్పుడూ వెళ్లలేదు. కానీ పచ్చపార్టీ నేతలు ఇప్పుడు పర్మినెంట్ డీలర్లను వదల్లేదు. వాటిలో కొన్ని రేషన్ షాపులైతే ఒంటరి మహిళలే నడుపుతున్నారు. తండ్రులు, భర్తలు మరణించడంతో ఒంటరి మహిళలే రేషన్ షాపులు నిర్వహిస్తున్న సందర్భాలు జిల్లాలో ఉన్నాయి. ఎలాంటి కనికరం లేకుండా వారిపై కూడా రాజీనామా చేయాలంటూ అధికారులతో ఒత్తిళ్లు చేయించారు. రాజీనామాలు చేయని డీలర్లకు రేషన్ సరుకులు సరఫరా చేయకుండా నిలువరించడం. రేషన్ పంపిణీ సమయంలోను కనీసం కింద పడి కేజీ అరకేజీ తగ్గినా కేసులు పెట్టేలా భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు బాధిత డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీలర్ల మార్పుతో రేషన్ బియ్యం దందాలు షురూ..

రేషన్ షాపులు మార్పులు అయిన తర్వాత వందల కోట్ల విలువైన పేదల బియ్యాన్ని పచ్చ నేతలు ఆదాయ మార్గంగా మార్చుకుని తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు దోచేస్తున్నారు. పేదలకు చేరాల్సిన బియ్యం అడ్డదారిలో వ్యాపారం చేస్తున్నారు. లక్షల కేజీల్లో పేదల బియ్యాన్ని డబ్బుగా మార్చుకునేలా నెట్‌వర్క్ నడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జులై నెల నుంచి ఇప్పటి వరకు అక్రమ రేషన్ బియ్యానికి సంబంధించి 84 పైగా దాడులు నిర్వహించి 100కు పైగా 6ఏ కేసులు నమోదు చేశారు. దీన్నిబట్టి కూటమి నేతల అక్రమ రేషన్ దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థమవుతోంది. ప్రతి రేషన్ షాపునకు ఆయా ప్రాంతాలను బట్టి 6 టన్నుల నుంచి 15 టన్నుల వరకు బియ్యం సరఫరా అవుతోంది. జిల్లాలో మొత్తం 6,78,160 రేషన్ కార్డులు ఉండగా సరుకులు పంపిణీ చేసేందుకు 1392 రేషన్ షాపులు ఉన్నాయి. రేషన్ షాపులకు వచ్చిన బియ్యం పది లేదా పదిహేను శాతం కార్డుదారులకే బియ్యం అందుతోంది. మిగిలిన బియ్యం మొత్తం కూటమి నేతల దందాలకు డబ్బుగా మారుతోంది.

17 రేషన్‌షాపులపై 6ఏ కేసులు నమోదు

కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 186 రేషన్‌షాపులు ఉండగా వాటిలో 17 షాపులపై 6ఏ కేసులు నమోదు చేశారు. టంగుటూరు మండలంలో 48 రేషన్‌షాపులు ఉండగా అత్యధికంగా 10 షాపులపై, సింగరాయకొండ మండలంలో 34 రేషన్‌షాపులు ఉండగా 3 షాపులపై, మర్రిపూడి మండలంలో 24 షాపులు ఉండగా 2 షాపులపై, జరుగుమల్లి మండలంలో 23 షాపులు ఉండగా ఒక షాపుపై, కొండపి మండలంలో 30 రేషన్‌షాపులు ఉండగా ఒక షాపుపై 6ఏ కేసులు నమోదు చేశారు. పొన్నలూరు మండలంలో 27 షాపులు ఉండగా ఒక్క షాపుపై కూడా 6ఏ కేసు నమోదు చేయకుండా అందరూ రాజీనామా చేసేలా అధికారుల చేత బెదిరించి, ఒత్తిడి తెచ్చి సఫలీకృతులయ్యారు. నియోజకవర్గంలోని 186 షాపులకు గాను సుమారు 15 షాపుల్లో మాత్రమే పాత వారు కొనసాగుతుండగా మిగిలిన 171 షాపుల్లో కొత్తవారు కొనసాగుతున్నారు.

అధికారులపై ఒత్తిడి తెచ్చి కేసు నమోదు



32 సంవత్సరాలుగా ఎటువంటి అవినీతికి పాల్పడకుండా చౌకధరల దుకాణం నిర్వహించాను. అటువంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామంలోని టీడీపీకి చెందిన ఓ సామాజిక వర్గం నాపై కక్ష కట్టి రేషన్ సరుకులు తీసుకోకుండా బాయ్‌కాట్ చేశారు. నాషాప్ పై కేసు నమోదు చేయాలని అధికార పార్టీ నాయకులతో అధికారులపై ఒత్తిడి తెచ్చి డీలర్ షాప్‌ను తనిఖీల పేరిట కేసు నమోదు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా ప్రజలకు రేషన్ సరుకులు అందించాను. అటువంటిది అకారణంగా నామీద కేసు నమోదు చేయటం అన్యాయం. జరిగిన సంఘటనపై కోర్టుకు వెళతాను.

– ఎస్‌కె.నూర్జహాన్, డీలర్, సిద్దవరం, కొనకనమిట్ల మండలం

ఎలాగైనా కేసు నమోదు చేయాలని దాడులు



వల్లూరు గ్రామంలో 20 సంవత్సరాలుగా రేషన్ దుకాణం నిర్వహిస్తున్నా ఇప్పటికీ ఒక్క ఫిర్యాదు కూడా లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా రెండు మార్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎలాగైనా కేసు నమోదు చేసి రేషన్ షాపు తొలగించాలని అటు నాయకులు, ఇటు అధికారులు భీష్మించి కూర్చున్నారు.

– ననగర శ్రీనివాసరావు, రేషన్ డీలరు, వల్లూరు, టంగుటూరు మండలం

ప్రజాతీర్పుతో వచ్చిన ఓటమి కాదు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఈవీఎంలపై అనుమానాలు
- కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో చెవిరెడ్డి
- టీడీపీ దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం..మాజీ మంత్రి కారుమూరి
- జమిలి ఎన్నికలు వస్తే సిద్ధంగా ఉండాలి..ఎమ్మెల్యే బూచేపల్లి
- కష్టాల్లో తోడుగా ఉంటామని పార్టీ శ్రేణులకు నాయకుల భరోసా

బేస్తవారిపేట: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి ప్రజా తీర్పుతో వచ్చింది కాదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. గిద్దలూరులోని విత సుబ్బరత్నం కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత ఈవీఎంల పనితీరుపై దేశవ్యాప్తంగా అనుమానాలు మరింత బలపడ్డాయన్నారు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఈవీఎంలను కాదని పేపర్‌బ్యాలెట్ వినియోగిస్తున్నారని, ప్రపంచ టెక్ దిగ్గజం ఎలన్‌మస్క్ కూడా ఈవీఎంలను ట్యాంపర్ చేయవచ్చని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నాడని తెలిపారు. జగనన్న హామీ ఇస్తే నూరు శాతం అమలు చేస్తాడని వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాలర్ ఎగరేసి చెప్పగలడని, అదే టీడీపీలో ఈ పరిస్థితి లేదన్నారు. మీలో ఒకడిగా కష్టసుఖాల్లో నడుస్తానని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 30 లక్షల సైన్యం తయారవుతోందన్నారు. కష్టం తెలుసు, కార్యకర్త విలువ తెలుసు నిరంతరం పోరాటమే తెలుసుకాని వెనుతిరగనన్నారు. మిమ్మల్ని ఇబ్బంది పెడితే ఎంత వరకైనా పోరాటం చేస్తానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

మాజీ మంత్రి, రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయలేక రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబు ఓడిపోతే మూడేళ్ల వరకు ప్రజల్లోకి రాలేదని, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల పక్షాన నిలిచారన్నారు. నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్త ప్రతి గడప వద్దకు వెళ్లే పరిస్థితి ఉందని, టీడీపీ నాయకులకు ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచకాలు చేస్తూ రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చిందన్నారు. టీడీపీ చేసే దుర్మార్గాలను చర్చించండి, ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం–అభివృద్ధి, కార్యకర్తలను రెండు కళ్లుగా చూసుకుంటానని జగనన్న చెప్పమన్నాడన్నారు. 2027, 29 ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు గట్టిగా నిలబడాల్సిన అవసరముందన్నారు. టీడీపీ చేసే దౌర్జన్యాలు, కేసులను తట్టుకుని నిలబడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మీఅందరికీ పార్టీ అండగా నిలబడుతుందన్నారు. 100 శాతం హామీలు అమలు చేసి నిఖార్సైన రాజకీయం చేశామని, ప్రజల ఆదరణ మనకు ఎప్పుడూ ఉంటుందన్నారు.

గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది కానీ ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ప్రజలు బయటకు వచ్చి గళమెత్తే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. నేటి పరిస్థితులను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న ఐదేళ్లలో పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కృషిచేశారన్నారు. కరోనా సమయంలో ఎందరో ప్రాణాలను రక్షించారని, ఆరోగ్యశ్రీ పథకంలో కరోనాను చేర్చి ఉచిత వైద్యం అందించారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీలు కడప లక్ష్మీ, వేగినాటి ఓసూరారెడ్డి, చేగిరెడ్డి తులశమ్మ, జెడ్పీటీసీలు బీవీ రాజయ్య, సారె వెంకటనాయుడు, పగడాల దేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు గొంగటి చెన్నారెడ్డి, సీఆర్ఐ మురళి, కొండా రఘునాథ రెడ్డి, పీ రామకృష్ణారెడ్డి, బోయిళ్ల జనార్దనరెడ్డి, మాజీ ఎంపీపీలు కడప వంశీధరరెడ్డి, పీ వెంకటరాజు, గొటికే రాజేశ్వరరెడ్డి, రవికుమార్ యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు నెమిదిన్నె చెన్నారెడ్డి, యేలం వెంకటేశ్వర్లు, సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు ఎదురు శ్రీనివాసరెడ్డి, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు డాక్టర్ భూమ నరసింహారెడ్డి, వేమిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్లూ బుక్ రెడీ చేస్తున్నాం.. జాగ్రత్త



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు

- ఉమ్మడి ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు

యర్రగొండపాలెం: కూటమి నాయకుల పదవులు ఎన్నాళ్లో ఉండవని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న దొంగ కేసులు ఎన్నాళ్లో నిలవవని, రెడ్ బుక్ పేరుతో చేస్తున్న అరాచకాలను ఎదుర్కొనేందుకు తాము బ్లూ బుక్ రెడీ చేస్తున్నామని ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. అధికారం ఉందని విర్రవీగుతున్న నాయకులు జాగ్రత్తగా ఉండాలని, పోలీసులే వాళ్ల మీద తిరగబడతారని హెచ్చరించారు. స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని వైష్ణవి గార్డెన్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. కారుమూరి మాట్లాడుతూ.. కూటమి నాయకుల అడ్డగోలు ఆదేశాలను పాటిస్తున్న పోలీసులు, ఇతర శాఖల అధికారులు ఇప్పుడిప్పుడే ఆలోచిస్తున్నారన్నారు. టీడీపీ కార్యకర్తలు, ఎమ్మెల్యేలు ప్రజల వద్దకు వెళ్లే పరిస్థితి లేదని పచ్చి అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన మీరు ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. తమ గొంతులు నొక్కేందుకే వాళ్లు కేసులు పెడుతున్నారని, ఇది ఎన్నోరోజులు సాగదని అన్నారు. కూటమి నాయకులు దొంగచాటుగా తిరుగుతున్నారని, ఇసుకను ఫ్రీగా ఇస్తానని చెప్పి దొంగ చాటున అమ్ముకుంటున్నారన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గురించి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మాట్లాడాలని, జగనన్న ప్రభుత్వంలో అమలైన పథకాలను జ్ఞాపకం చేయాలన్నారు.

ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఎలా పరిపాలించాలో మన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి చూపించాడని, రాష్ట్రాన్ని ఎలా పరిపాలించకూడదో ఇప్పుడు టీడీపీ నాయకుడు చూపిస్తున్నాడని అన్నారు. ఓడిపోయినా కూడా రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, నాయకులు ప్రజల వద్దకు వెళ్లి మా నాయకుడు ఒక్క హామీ కూడా మాట తప్పకుండా అమలు చేశారని కాలర్ ఎగరవేసి చెప్పగలమని అన్నారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అమలు చేసి వైఎస్ జగన్ పేదల గుండెల్లో నిలిచారన్నారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలను, వంట మనుషులను, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తీసేస్తున్నారన్నారు. మొన్న ఒక బిడ్డకు అన్యాయం జరిగిందని ఆ బిడ్డ తండ్రి ఫోన్ చేసిచెప్తే, ఆ బిడ్డను పలకరించి, ధైర్యం చెప్పివస్తే నా మీద పోక్సో, ఎస్సీ, ఎస్టీ, ఐటీ కేసులు పెట్టారని, అన్యాయం జరిగిందని బిడ్డను పలకరిస్తే ఇటువంటి కేసులు పెడతారా అని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి కేసులు ఎన్ని పెట్టినా భయపడేది లేదని, జైలుకు వెళ్లి వచ్చి కూడా ప్రజల తరఫున పోరాటం చేస్తామని అన్నారు. ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, గత ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తే యర్రగొండపాలెం నియోజకవర్గంలో 52 వేల ఓట్లు మెజార్టీ వచ్చిందని చెప్పారు.

జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మీయ సమావేశానికి వచ్చిన కార్యకర్తలను చూస్తుంటే మన పార్టీ అధికారంలోనే ఉందనిపిస్తుందని అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కేసులు పెడుతుంటే ఇక్కడ ఎమ్మెల్యేపైనే కేసులు పెట్టారని అన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని, జిల్లాతోపాటు యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, జగనన్న సీఎం అవుతారని అన్నారు. 6 నెలల కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలు విసిగి వేసారిపోయారని, ఎప్పుడు ఈ ప్రభుత్వం దిగిపోతుందా అన్న ఆలోచనతో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు విస్మరించి, ప్రజల నెత్తిన విద్యుత్ చార్జీల పెంపు భారం మోపారని, సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేసుకున్న కూటమి ప్రభుత్వం సూపర్ ఫ్లాప్ అయిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీకి కంచుకోటగా ఉన్న యర్రగొండపాలెం నియోజకవర్గంలో మరోసారి పార్టీ జెండా ఎగురేసేందుకు నాయకులు, కార్యకర్తలతోపాటు తాను అలుపెరగని పోరాటం చేస్తానని, ప్రజల సమస్యలను ఎప్పుడికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం

- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: దేశాన్ని కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లోకి నెట్టిన ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటన పోరాటాలు చేయాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. మాదాల నారాయణస్వామి 11వ వర్ధంతి సభ సోమవారం ఒంగోలులోని మాదాల నారాయణ స్వామి భవనంలో కె.నాంచార్లు అధ్యక్షతన నిర్వహించారు. అంతకు ముందు మైనంపాడు గ్రామ సమీపంలోనే గుండ్లవాగు దగ్గర మాదాల నారాయణస్వామి స్థూపానికి, మాదాల కోటయ్య, నరసయ్యల స్థూపానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణ స్వామి 68 సంవత్సరాల పాటు కమ్యూనిస్టుగా తన పోరాట జీవితాన్ని కొనసాగించారని చెప్పారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సి.ఎస్.సాగర్, భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్, పద్మ పాల్గొన్నారు.

అప్రంటీస్ మేళాలో 43 మంది ఎంపిక

ఒంగోలు సిటీ: అప్రెంటీస్ మేళాలో సుమారు 72 మంది విద్యార్థులు హాజరుకాగా, 43 మంది అప్రెంటీస్ శిక్షణకు తాత్కాలికంగా ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్ షిప్ మేళా డిసెంబరు–2024 కార్యక్రమంలో సహాయ అప్రెంటీస్ సలహాదారు, ప్రధానాచార్యులు ఎం.వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐటీఐ పాసైన విద్యార్థులు పూర్తి స్థాయి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలంటే అప్రంటీస్‌షిప్ ట్రైనింగ్ తప్పనిసరిగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఈ అప్రంటీస్ మేళాలో ఐటీఐ పాసైన విద్యార్థులకు గొప్ప అవకాశమన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.భరద్వాజ్, డీఎస్‌డీఓ రవి తేజ యాదవ్ పాల్గొని అప్రంటీస్ విలువల గురించి మాట్లాడారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



టంగుటూరు: గుర్తు తెలియని మృతదేహం స్థానిక కొండపి ఫ్లైఓవర్ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు..సుమారు 40 ఏళ్ల వయసున్న వ్యక్తి కొండపి ఫ్లైఓవర్ సమీపంలో జాతీయ రహదారిపై మృతి చెంది ఉన్నాడు. మృతుడు బులుగు రంగు జీన్స్ ప్యాంట్, కృష్ణ బులుగు రంగు షర్టు ధరించి ఉన్నాడు. షర్టు కాలర్‌పై చిలకలూరిపేట టాన్ టేక్స్ టైలర్స్ అని ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9121102135, 9121102137, 9121102120 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ధాన్యం విక్రయాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు

దర్శి: ధాన్యం విక్రయాలకు రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి జి.వరలక్ష్మి అన్నారు. మండలంలోని లంకోజనపల్లి, రాజంపల్లి, బొట్లపాలెం రైతు సేవాకేంద్రాల్లో ధాన్యం కేంద్రాల ద్వారా వరి మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు అందుబాటులో ఉండాల్సిన గోనెసంచులు, పట్టాలు ఇతర ముఖ్య వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం సేకరిస్తామని తెలిపారు. బీపీటీ 5224 వంటి గ్రేడ్‌లకు క్వింటా ధర రూ.2320, సాధారణ రకం క్వింటా ధర రూ.2300 నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాలకే నేరుగా డబ్బులు జమవుతాయని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు పంట కోతలను అనువుగా చూసుకుని ప్రారంభించాలన్నారు. ముందస్తుగా కోసి ఉంటే ఎకరాకు 25 కేజీల ఉప్పును ధాన్యం మీద స్ప్రే చేయాలని సూచించారు. అదే విధంగా మందస్తుగా టార్పాలిన్ పట్టలను సేకరించుకోవాలన్నారు. కార్యక్రమంలో దర్శి సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీనాయక్, టెక్నికల్ ఏఓ సంఘమేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి బాలకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

పొన్నలూరు: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని చెన్నిపాడు గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు..చెన్నిపాడు గ్రామానికి చెందిన గుత్తి మౌనిక(22) రెండేళ్లుగా కందుకూరులోని ప్రైవేట్ కళాశాల్లో నర్సింగ్ కోర్సు చేసి ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్ వెళ్లింది. ఆరు నెలలుగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్ నర్సుగా చేరి ట్రైనింగ్ పొందుతుంది. అయితే ఏడాది క్రితం మౌనిక తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటి నుంచి మౌనిక మానసికంగా ఆందోళన చెందుతూ ఒంటరిగా ఉండేది. కుటుంబ సభ్యులు వివాహం చేసుకోమని చెప్పినా వారి మాటలు తిరస్కరించి ఒంటరిగా ఉండటం అలవాటు చేసుకుంది. తోడుగా ఉన్న తన తల్లి చనిపోయిందంటూ మానసికంగా ఆలోచిస్తూ ఇటీవల అనారోగ్యానికి గురైంది. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్ నుంచి చెన్నిపాడు ఇంటికి వచ్చిన మౌనిక తనకు ఆరోగ్యం బాగలేదని తండ్రికి చెప్పి బాధపడింది. అయితే ఏమైందో ఏమో గానీ సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయం చూసి మౌనిక చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై అనుక్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మౌనిక మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనుక్

కన్ను పడితే కబ్జానే..!

అతనో భూబకాసురుడు. స్థలం కనిపిస్తే కబ్జా చేసేసి అధికారుల అండతో అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుంటాడు. అంతటితో అతగాడి భూదాహం తీరలేదు. కుమారులకు పంచగా అవసాన దశలో ఆసరాగా ఉంటుందని ఉంచుకున్న కన్నతల్లి భూమినీ ఆమెకు తెలియకుండా వేలిముద్రలు వేయించుకొని రాయించేసుకున్నాడు. కొడుకు దురాగతం తెలుసుకున్న ఆ తల్లీ సచివాలయం వద్ద ధర్నాకు దిగింది. దీంతో అప్పటి వరకు ఆక్రమణదారుడి దురాగతాలకు భూములు పోగొట్టుకున్న బాధితులు బయటకు వచ్చి ఆ తల్లితో కలిసి ధర్నాకు దిగారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని కార్యాలయం వద్దే భీష్మించుకుకూర్చున్నారు. అధికారుల అండతో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఈ బకాసురుడు కబ్జా చేసిన వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.



రమణయ్య కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్న దళితుల భూమిలో నరసమ్మ సమాధి

- కన్న తల్లి భూమినీ వదలని దుర్మార్గుడు
- కన్నతల్లి ధర్నాకు దిగడంతో బయటకు వచ్చిన బాధితులు
- సుమారు రూ.2.5 కోట్ల విలువైన భూములు కబ్జా
- అధికారుల సాయంతో కుటుంబ సభ్యుల పేరుపై ఆన్‌లైన్
- న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని భీష్మించిన తల్లి, బాధితులు
- ఆక్రమణదారుడు కేంద్ర మంత్రి పెమ్మసాని బంధువు

మద్దిపాడు: మండలంలోని ఏ గ్రామ రెవెన్యూ పరిధిలోనైనా భూమి ఖాళీగా కనిపిస్తే కబ్జా చేసేస్తాడు. అధికారుల అండగా కుటుంబసభ్యుల పేరుపై అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకొని దర్జాగా పాసుపుస్తకాలు తీసుకుంటాడు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆక్రమణదారుడు సాగించిన దందా అంతా ఇంతా కాదు. రెవెన్యూ అధికారుల అండతో సుమారు రూ.2.5 కోట్ల విలువైన భూములను యథేచ్ఛగా ఆక్రమించుకొని ఆన్‌లైన్ చేయించుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రామానికి చెందిన పాలెపు రమణయ్య తెలుగుదేశం పార్టీ నాయకుడు. గతంలో ఏఎంసీ వైస్ చైర్మన్‌గానూ, అతని భార్య సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామంలో నాయకుడిగా చలామణి అవుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో తన దర్పం ప్రదర్శిస్తుంటాడు. ప్రస్తుతం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు రమణయ్య బంధువు కావడంతో మండలంలో కేంద్ర మంత్రి పేరు చెప్పుకొని తిరుగుతున్నాడు.



జువ్విగుంట సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు, గ్రామస్తులు

ఆక్రమణలో కొన్ని..

రావిళ్లవారిపాలెం గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన పులగం నరసమ్మకు చిమటగ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 727-1 లో 1.63 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ఆమె కుమారులకు పంపకం కుదరక నిలిపివేశారు. దీంతో ఆ భూమి బీడుభూమిగా మారింది. పాలెపు రమణయ్య భూమికి ఆనుకుని ఉన్న ఈ బీడు భూమి పై పచ్చనేత పాలెపు రమణయ్య కన్నుపడింది. నర్సమ్మ కుమారులకు తెలియకుండా గత తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి తహసీల్దార్ సాయంతో రమణయ్య కుమార్తె పాలెపు ప్రశాంతి పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడని దళితులు వాపోయారు.


☛ గ్రామానికి చెందిన పులగం పెదకోటయ్యకు ఇందిరాగాంధీ ప్రభుత్వంలో సర్వే నంబర్ 727-19లో 1.88 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఇచ్చింది. ఈ భూమిని హక్కుదారునికి తెలియకుండా రమణయ్య కుమారుడైన పాలెపు తిరుపతినాయుడు పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించారు.

☛ రావిళ్లవారిపాలెం గ్రామానికి చెందిన దళిత మహిళ సొలసా చిన్నమ్మకు సర్వే నంబర్ 740-3లో 0.92 ఎకరాల ప్రభుత్వభూమి ఇచ్చింది. ఈ భూమి ఆమెకు తెలియకుండా రమణయ్య కుమార్తె అయిన పాలెపు ప్రశాంతి పేరుపై ఎక్కించుకున్నాడు. గ్రామానికే చెందిన పాలెపు పుష్పావతి పేరుపై సర్వే నంబర్ 717లో 2.88 ఎకరాల భూమి ఉంటే వారికి తెలియకుండా రెవిన్యూ అధికారుల సహకారంతో రికార్డుల్లో నమోదైన పేరును కొట్టేసి రమణయ్య భార్య పాలెపు పద్మపై రాయించాడు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని చిమట, జువ్విగుంట రెవిన్యూ పరిధిలో సుమారు రూ. 2.5 కోట్ల విలువైన భూములను కబ్జా చేసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.



నా కొడుకే నా భూమిని కబ్జా చేశాడయ్యా: రాగమ్మ

నాకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కూతుళ్లు పెళ్లి చేసుకొని వెళ్లిపోయాడు. నా భర్త పేరుతో ఉన్న 32 ఎకరాలను ముగ్గురు కుమారులకు పంచగా 0.43 ఎకరాల భూమి మిగిలింది. అవసాన దశలో కాస్త ఆసరాగా ఉంటుందని ఉంచుకున్నా. కానీ నాకు తెలియకుండా నా పెద్ద కుమారుడు రమయ్య వేలిముద్రలు వేయించుకొని ఆన్‌లైన్ చేయించుకుని, దొంగచాటున వాడి కొడుకు పాలెపు తిరుపతినాయుడుకు రిజిస్ట్రేషన్ చేశాడు. నాకు అన్నం పెట్టకుండా ఇంట్లో నుంచి నెట్టేశారు. నేను చనిపోయిన తరువాత భూమి తీసుకోమనండి. న్యాయం జరిగే వరకు ధర్నా చేస్తాను.



రెవిన్యూ రికార్డుల్లో పుష్పావతి పేరును కొట్టేసి రమణయ్య భార్య పద్మ పేరు రాసి ఉన్న దృశ్యం



రమణయ్య కుమారుడు తిరుపతి నాయుడు పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్న భూమి



పులగం నర్సమ్మకు ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకం

మా భూమి మాకు ఇవ్వాలి



తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఆస్తిని గ్రామానికి చెందిన పాలెపు రమణయ్య మాకు తెలియకుండా ఆన్‌లైన్ ఎక్కించుకున్నాడు. మా అమ్మ నర్సమ్మ చనిపోయింది. ఆమె సమాధి కూడా మా పొలంలోనే ఉంది. ముగ్గురు కుమారులకు రావాల్సిన 1.63 ఎకరాల బీడు భూమిని రమణయ్య కుటుంబ సభ్యుల పేర్లుతో ఎక్కించుకున్నాడు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ భూమిని కాజేశాడు. మా భూమిని మాకు ఇప్పించండి.

– పులగం పెద్దకోటయ్య, రావిళ్లవారిపాలెం

న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తాం



చిమట రెవెన్యూ పరిధిలో ఇందిరాగాంధీ హయాంలో 0.92 ఎకరాల భూమికి పట్టా ఇచ్చారు. నాకు తెలియకుండా రమణయ్య కుటుంబసభ్యులకు పాసుపుస్తకాలు తెచ్చుకున్నాడు. నా భూమి నాకు ఇచ్చేంత వరకు నిరసన చేస్తాం. న్యాయం జరిగేంత వరకు విశ్రమించం.

– సొలసా చెన్నమ్మ, రావిళ్లవారిపాలెం

ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

- నిర్ణీత సమయంతో సమస్యలు పరిష్కరించాలి
- గ్రీవెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రత్యేక శ్రద్ధతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి మీకోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించడంతో పరిష్కారంలో నాణ్యత ఉండాలన్నారు. ప్రజా సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమస్యలు పరిష్కరించకుండా ఎండార్స్‌మెంట్‌లు ఇస్తే సహించేది లేదన్నారు. చిత్తశుద్ధతో సమన్వయంతో అధికారులు ప్రజా సమస్యలపై స్పందించాలన్నారు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో మొత్తం 223 అర్జీలు అధికారులకు అందాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

✎ మాలమహానాడు ఆధ్వర్యంలో అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడం లేదని ఫిర్యాదు చేశాడు. కరవది అనిల్ అనే దళిత ఉద్యోగిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు ప్రయత్నం చేయడమే కాకుండా కోర్టు ఉత్తర్వులను గాలికొదిలేస్తున్నారని, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవలని కోరుతూ అర్జీ అందచేశాడు.

✎ టంగుటూరుకు చెందిన కూరగాయల వ్యాపారి పత్తిపాటి పుల్లారావు మరో 27 మంది చిరు వ్యాపారులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తమకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరుతూ అర్జీ అందచేశారు. గత 40 ఏళ్లుగా టంగుటూరు సెంటర్‌లో వివిధ రకాల చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను గత 2 నెలల నుంచి గ్రామ పంచాయతీ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా వ్యాపారం చేసే స్థలాన్ని ఖాళీ చేయాలని భయాందోళనలకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. చిరువ్యాపారాలు చేసే తమను ఆదుకోవాలని కోరారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 75 ఫిర్యాదులు

- ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు సిటీ: బాధితుల పక్షాన నిలిచి సత్వర న్యాయం అందించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ కె.నాగేశ్వరరావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల రాతపూర్వక అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి.. సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ఫిర్యాదులపై పోలీసు ఉన్నతాధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్టపరిధిలో విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని కోరారు. గ్రీవెన్స్‌లో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, జాబ్‌మోసాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలు గురించి విన్నవించుకున్నారు. డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవ ప్రభాకర్, ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ప్యానెల్ అడ్వకేట్ శివరామకృష్ణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియాసుల్తాన్, ప్రభాకర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

పోలీసు అధికారి ఫోన్ హ్యాక్

మార్కాపురం: మార్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఒక పోలీసు అధికారి ఫోన్‌ను సైబర్‌నేరగాళ్లు సోమవారం హ్యాక్‌చేశారు. ఆ అధికారికి తెలియకుండానే ఆ ఫోన్ నుంచి మిగతా ఫోన్లకు ఏపీకే ఫైల్స్ పంపారు. ఈ యాప్‌ను ఓపెన్ చేసిన వారి అకౌంట్లలో ఉన్న నగదు మొత్తం ఖాళీ చేస్తారు. అయితే తనకు తెలియకుండానే తన ఫోన్‌నుంచి మెసేజ్‌లు వెల్లడాన్ని గుర్తించిన పోలీసు అధికారి వెంటనే అప్రమత్తమై ఒంగోలు ఐటీ టీంకు సమాచారం అందించడంతో పాటు ఫిర్యాదు చేసిన నిముషాల వ్యవధిలోనే ఏపీకే ఫైల్స్ మొత్తం డిలీట్ చేయించారు. కాగా నాలుగురోజుల క్రితం పట్టణానికి చెందిన నరేష్ అనే వ్యక్తి ఫోన్‌ను సైబర్‌నేరగాళ్లు హ్యాక్‌చేసి అకౌంటులో ఉన్న రూ.49వేల నగదును స్వాహా చేశారు. ఇలా సైబర్ నేరగాళ్లు వివిధ రకాల యాప్‌లను వాట్సప్ వినియోగదారులకు పంపి సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

గంజాయి ముఠా అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

- 12 మందిని అరెస్టు చేసిన పోలీసులు
- 4 కేజీల గంజాయి స్వాధీనం
- నిందితులు ఒడిశా, బీహార్‌కు చెందిన ప్రధాన సూత్రధారులు

ఒంగోలు సిటీ: జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న 12 మంది ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. ఒడిశాకు చెందిన ప్రశాంత్‌కుమార్ సాహు, సునీల్ బెహ్రా, మద్దిపాడు మండలం, నెలటూరు గ్రామానికి చెందిన వడెల వాసు, నాగులుప్పలపాడు మండలం వినోదరాయునిపాలేనికి చెందిన చెన్నయపాలెం నాగ వెంకటసాయి మిథుస్, నాగులుప్పలపాడు మండలం రాపర్ల గ్రామానికి చెందిన దాకా సుబ్బరామిరెడ్డి, నేలటూరు గ్రామానికి చెందిన కుంచాల మణికంఠ, ఒడిశాకు చెందిన అభినాష్ బెహ్రా, నేలటూరు గ్రామానికి చెందిన తన్నీరు అంకమ్మరావు, నేలటూరు గ్రామానికి చెందిన కుంచల వీరాంజనేయులు, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గుడిపాటి దుష్యంత్, ఒంగోలుకు చెందిన సుంకర బాల చిరంజీవి, బీహార్‌కు చెందిన సోనూరామ్‌లను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కేసులో మొదటి నిందితుడైన ఒడిశాకు చెందిన ప్రశాంత్‌కుమార్ సాహు గత ఐదేళ్ల నుంచి మద్దిపాడు మండలం వెల్లంపల్లి స్పిన్నింగ్ మిల్లులో కార్మికునిగా పనిచేస్తున్నాడు. స్పిన్నింగ్ మిల్లు ఆగిపోయిన తర్వాత అక్కడే నివాసం ఉంటూ గంజాయి వ్యాపారం ప్రారంభించాడు. తనకు అవసరమైనప్పుడల్లా ఒడిశాకు వెళ్లి గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయించేవాడు. అలాగే ఒడిశాకు చెందిన సునీల్ బెహ్రాతో కలిసి గంజాయి సేవిస్తూ ఇద్దరూ గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో నేలటూరుకు చెందిన వడెల వాసు, మణికుమార్ లు ప్రశాంత్‌కుమార్ సాహు పరిచయం పెంచుకొని వారి నుంచి గంజాయి కొనుగోలు చేసేవాడు. 2022లో వాసు, మణికుమార్‌లు అరకు నుంచి గంజాయిని తరలిస్తుండగా దేవరాపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. అయినా వారి ప్రవర్తన మార్చుకోకుండా బయటకు వచ్చిన తరువాత గంజాయి వ్యాపారాన్ని కొనసాగించారు. ఈ క్రమంలో సోమవారం వెల్లంపల్లి గ్రామ పరిధిలోని స్పిన్నింగ్ మిల్ దగ్గర శ్రీసాయి డెవెలపర్స్ వెంచర్ వద్ద చేరి గంజాయిని పంచుకుంటుండగా పోలీసులు దాడి చేశారు. నిందితులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయిని, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నాడు. గంజాయి ముఠాను అరెస్టు చేసిన డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్, మద్దిపాడు ఎస్సై బి.శివరామయ్య, ఒంగోలు వన్‌టౌన్ ఎస్సై పి.శివనాగరాజు, మద్దిపాడు హెడ్ కానిస్టేబుళ్లు బి.వెంకటేశ్వర్లు, సీహెచ్.ఉమామహేశ్వరరావు, ఇతర సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి

క్రీడలతో మానసిక ఉల్లాసం

- గొట్లగట్టులో జిల్లాస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

కొనకనమిట్ల: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి అన్నారు. జిల్లా రగ్బీ అసోషియేషన్ ఆధ్వర్యంలో గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం జిల్లా స్థాయి రగ్బీ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి వచ్చిన రగ్బీ క్రీడాకారులను పరిచయం చేసుకున్న హెచ్‌ఎం విజయలక్ష్మి పోటీలను ప్రారంభించారు. బాలురు, బాలికలకు నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని గొట్లగట్టు, అర్ధవీడు, కురిచేడు, బొద్దికూరపాడు, తుమ్మలచెరువు, తాడివారిపల్లి, చెన్నారెడ్డిపల్లి వెలుగొండ, చింతలపాలెం ప్రభుత్వ పాఠశాలల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పాఠశాల పీడీ, రగ్బీ క్రీడా కోచ్ వై.బాలగురవయ్య పర్యవేక్షణలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15,16,17 తేదీల్లో గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారని కోచ్ బాలగురవయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కోచ్ బాలగురవయ్యను హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీఈటీలు పెద్దన్న, చంద్రశేఖరరావు, రాజశేఖర్, అంకయ్య, వెంకటేశ్వర్లు, రవి ప్రసాద్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన బాలురు